బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 12 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## 18, 19 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్న టీజీపీఎస్సీ బృందం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రా వెంకటేశం కమిషన్ పనితీరును మెరుగుపరిచేందుకు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా ఈ నెల 18 ,19 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆయనతో పాటు కమిషన్ ప్రతినిధి బృందం ఢిల్లీలో పర్యటించనుంది. ఈ నెల 18న యూపీఎస్సీ, ఈ నెల 19న స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పనితీరుపై కమిషన్ బృందం అధ్యయనం చేయనుంది.

ఈమేరకు బుధవారం టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం యూపీఎస్సీ చైర్‌పర్సర్ ప్రీతి సూడాన్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ చైర్మన్ ఎస్ గోపాలకృష్ణన్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మరింత విస్తృత చర్చల కోసం ఢిల్లీకి వస్తామని చెప్పగా ఇందుకు వారు అంగీకరించారు. ఈ పర్యటనలో భాగంగా పరీక్షావిధానం, మూల్యాంకన ప్రక్రియ, ఎంపిక విధానాల్లో రెండుసంస్థలు అనుసరిస్తున్న పారదర్శక విధానాలను అధ్యయనం చేయనున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు

- పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన
- 31వ తేదీ నాటికి పరిశీలన పూర్తి చేయాలి
- సామాజిక సర్వేకు తుదిగడువు 13వ తేదీ
- 14వ తేదీన సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో సహపంక్తి భోజనం
- 15,16 తేదీల్లో జరిగే గ్రూప్ -2 పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

# 80 లక్షల దరఖాస్తులు

## కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ ,హౌసింగ్. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ ,హౌసింగ్. సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన , గ్రూప్ -2 పరీక్షల నిర్వహణ, మెస్ ఛార్జీలపెంపు, సామాజిక సర్వే తదితర అంశాలపై బుధవారం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి సలహా దారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ " ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31వతేదీ లోగా పూర్తిచేయాలి. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి, ప్రతి ఐదు వందల మందికి ఒక ఉద్యోగి ( సర్వేయర్) ను నియమించుకోవాలి. సర్వే లో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలి, రాష్ట్రంలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాక పోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలి, ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ఆ ముందు రోజు రాత్రి గ్రామంలో చాటింపు చేయాలి. అంతేగాక స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్‌లు ప్రణాళికలు రూపొందించుకోవాలి, ఏ ఒక్క దరఖాస్తును విడిచిపెట్టకుండా చిన్న చిన్న పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలి, సర్వే వివరాలపై ప్రతి రోజు కలెక్టర్ లు సమీక్షించాలి, ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాలకోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఓ నిరంతర ప్రక్రియ ఈ ఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం "కలెక్టర్ లకు మంత్రి సూచించారు.

గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ప్రభుత్వ వసతి గృహాలలో చదువుకొనే విద్యార్థుల మెస్ ఛార్జీలను ఒక్కసారి కూడాపెంచలేదు. మా ప్రభుత్వం ఏడాది లోపే 40 శాతం మెస్ ఛార్జీలు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల 7.65 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగింది. కలెక్టర్లు తరచూ హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు అందించే సరుకుల క్వాలిటీ, క్వాంటిటీపై ప్రధానంగా దృష్టి సారించాలి. ఈనెల 14వ తేదీన మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ,పార్లమెంటు సభ్యులు స్థానికంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తాం. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొనాలి.

రాష్ట్రంలో 1కోటీ 16 లక్షల కుటుంబాలకు గాను 1కోటీ 12 లక్షల కుటుంబాల సామాజిక సర్వే (99.09 శాతం) పూర్తిచేయడం జరిగింది. ఇందుకు కృషి చేసిన అధికారులకు ముఖ్యమంత్రి గారి తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈనెల 13వ తేదీ సామాజిక సర్వేకు తుదిగడువు. ఆ తర్వాత ప్రజా పాలన సేవా కేంద్రాలలో కూడా కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసుకోవచ్చు.ఈనెల 15, 16 తేదీలలో జరిగే గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

## 21న తెలంగాణ మహిళా యునివర్సిటీకి రాష్ట్రపతి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21వ తేదీన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. వర్సిటీ (కోఠీ ఉమెన్స్ కాలేజీ) శతాబ్ది వేడుకలను ప్రారంభించనున్నారు. శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ఈ నెల 17న రాష్ట్రానికి రానున్న సంగతి తెలిసిందే. ఐదు రోజులపాటు ఆమె తెలంగాణలో గడపనున్నారు. ఈ పర్యటన షెడ్యూల్‌ను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది.

రాష్ట్రపతి 17న ఉదయం ముందుగా ఆంధ్రప్రదేశ్‌కు చేరుకుంటారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో జరిగే మొదటి కాన్వకేషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆ తర్వాత సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు. 20న సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌ను సందర్శిస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గవర్నర్, సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. 21వ తేదీన ఉదయం 11 గంటలకు కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి చేరుకుని శతాబ్ది వేడుకల్లో పాల్గొననున్నారు. కార్యక్రమం అనంతరం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్తారు.



## ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

### బాధ్యతలు స్వీకరణ

**ముంబయి :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్‌గా రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. ఆర్బీఐ 26వ గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ గవర్నర్‌గా సేవలందించిన శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. ఈ హోదాలో మల్హోత్రా మూడేండ్ల పాటు కొనసాగనున్నారు.

## సివిల్స్ మెయిన్స్‌లో తెలంగాణ అభ్యర్థులు సత్తా




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మెయిన్స్-2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది తొలి సారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. సివిల్స్ మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిన విషయం తెలిసిందే. సివిల్స్ సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ఈ ఏడాది తొలిసారిగా అమలు చేసింది. సింగరేణి సంస్థ అధ్వర్యం లో 135 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి వీరికి చెక్కులు పంపిణీ చేశారు.

రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది తాజాగా యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ. సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్ , బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కడారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్ధిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూలుకు చెందిన గోకమల్ల అంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్. ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి. ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, అసిఫాబాద్-కుమ్రంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ మెయిన్స్? క్వాలిఫై అయిన జాబితాలో ఉన్నారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# పశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాహూల్ గాంధీకి కేటీఆర్ లేఖ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చేతి గుర్తుకు ఓటేస్తే చేతగానీ ముఖ్యమంత్రిని తెలంగాణపై రుద్దారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో.. కాంగ్రెస్ సర్కార్ వల్ల అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతివర్గం అరిగోస పడుతోందని అన్నారు. ప్రగతి పథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతి పాలవుతుంటే తెలంగాణ వైపు కన్నెత్తి చూడని మీ తీరును చూసి నాలుగు కోట్ల ప్రజలు నిత్యం రగిలిపోతున్నారని మండిపడ్డారు. సీఎం ఢిల్లీకి పంపించే మూటలపై మీకున్న శ్రద్ధ.. ప్రజలకు మీరిచ్చిన మాటలపై శ్రద్ధ లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏ పేజీ తిప్పి చూసినా.. మోసం మీ నైజం.. అవినీతి మీ ఎజెండా, నియంతృత్వం మీ విధానమని అడుగడుగునా కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు.మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం చేతిలో తెలంగాణ బతుకు ఛిద్రమవుతుంటే ప్రేక్షక పాత్రే వహిస్తారా అని మండిపడ్డారు.

ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు అన్నట్లుగా సాగుతున్న మీ పాలన తీరు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా నిర్బంధం, సకల రంగాల్లో సంక్షోభమేనని ఈ ఏడాది పాలన రుజువు చేసిందని విమర్శించారు.గత పదేళ్లలో తాము తెలంగాణ పునర్నిర్మాణంపైనే దృష్టి పెట్టాం తప్ప.. పనికిమాలిన ఆలోచనలు చేయలేదని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని, రాజీవ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు పేర్లు మార్చలేదు, ఇందిరాగాంధీ విగ్రహాల జోలికి వెళ్లలేదు. కానీ మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వ ఆనవాళ్లను చెరిపేసే దారుణ కుట్రకు తెరలేపాడని మండిపడ్డారు. సీఎం రేవంత్ చేసిన ఈ నీచమైన, కుటిల చర్యలకు ప్రతిస్పందనగా భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గుర్తులు తెలంగాణలో చెరగడం ఖాయం అని గుర్తుంచుకోవాలని లేఖలో కేటీఆర్ హెచ్చరించారు.

"సరిగ్గా ఏడాది క్రితం కొలువుదీరిన మీ కాంగ్రెస్ సర్కారు తెలంగాణను ఆగం చేయడమే కాకుండా తెలంగాణ అస్థిత్వాన్ని కూడా దెబ్బతీస్తోంది. చేతకాని, మతిలేని ముఖ్యమంత్రిని తెలంగాణ నెత్తిన రుద్ది మీరు చేతులు దులుపుకోవడంతో అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతివర్గం అరిగోస పడుతోంది. వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక వర్గం దాకా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఎన్నికల టైంలో మీరు ఊరురా తిరిగి ఊదరగొట్టిన గ్యారెంటీలన్నీ గారడీలేనని మీ ఏడాది పాలన చూస్తే అర్థమైపోయింది. మీరు చేసిన డిక్లరేషన్ల పట్ల మీకే డెడికేషన్ లేదని అక్షరాలా రుజువైపోయింది. మేనిఫెస్టోలో మీరిచ్చిన 420 హామీలు.. కాంగ్రెస్ చీటింగ్ చాప్టర్ లో భాగమేనని తెలంగాణ సమాజానికి తెలిసిపోయింది. గాలి మోటర్లో వచ్చి గాలిమాటలు చెప్పి ఏడాదిపాటు పత్తా లేకుండా పోయిన మీకు, మీ పార్టీకి తెలంగాణ పట్ల రవ్వంత కూడా బాధ్యత లేదని తేలిపోయింది. ప్రగతి పథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతి పాలవుతుంటే తెలంగాణ వైపు కనీసం కన్నెత్తి చూడని మీ తీరును చూసి నాలుగు కోట్ల ప్రజలు నిత్యం రగిలిపోతున్నారు. సీఎం ఢిల్లీకి పంపే మూటలపై మీకున్న శ్రద్ధ, మీరు ప్రజలకు మీరిచ్చిన మాటపై లేకపోవడం నయవంచన, ద్రోహం కాక మరేంటి.

దేశానికే వెన్నుముక అయిన రైతన్నకు వెన్నుపోటు పొడిచిన దుర్మార్గపు పాలన మీది. కాంగ్రెస్ కు అధికారమిస్తే ఏక కాలంలో రైతులందరికీ డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట నీటిమూటే అయ్యింది. రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమైతే తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. అది కూడా నాలుగు విడతలుగా ఊరించి ఊరించి ఉసూరుమనిపించడంతో.. ఇప్పటికే దాదాపు 620 మంది రైతులు తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకున్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రిలో చలనం లేదు.. కాంగ్రెస్ సర్కారులో కనీస మానవత్వం లేదు.

బీఆర్ఎస్ హయాంలో అప్రతిహతంగా కొనసాగిన పెట్టుబడి సాయానికి కాంగ్రెస్ రాగానే బ్రేకులు వేశారు. బీఆర్ఎస్ సిద్ధం చేసిన రైతుబంధు నిధులను ఒకసారి విడుదల చేశారే తప్ప.. ఏడాదైనా మీరు చెప్పిన రైతుభరోసాను

మిగితా 2వ పేజీలో

## అన్ని మతాల ప్రజలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యత



- మంత్రి కొండా సురేఖ
- సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ఆలయంలో ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పున: ప్రతిష్టాపన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని మతాల ప్రజల మనోభావాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణ రాష్ట్ర గంగా జమున సంస్కృతి మరింతగా పరిఢవిల్లేలా పాలన చేపడుతున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. బుధవారం ఉదయం సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి సురేఖకు దేవాలయ నిర్వాహకులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మంత్రిగారికి పసుపు,కుంకుమ, చీరెలతో వాయనమిచ్చి తమ అభిమానాన్ని చాటారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నమ్మకాలు, మనోభావాలను గౌరవిస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి ధ్వంసమైన ముత్యాలమ్మ విగ్రహ స్థానంలో త్వరిత కాలంలోనే 250 కిలోల పంచలోహాలతో నూతన విగ్రహాన్ని ప్రతిష్టించిందని అన్నారు. దేవాలయంలో కూడా నవీకరణ పనులు చేపట్టి, వైభవోపేతంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో స్థానిక ప్రజలు, భక్తులు ఎంతో సంయమనంతో వ్యవహరించి, విగ్రహ పునఃప్రతిష్టకు ఎంతో సహకరించారని ప్రశంసించారు. ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టిన విషయాన్ని మంత్రి సురేఖ ఈసందర్భంగా గుర్తు చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి నాయత్వంలో మినీ ఇండియాగా అన్ని మతాలు, సంస్కృతుల సమ్మేళనంతో వర్ధిల్లుతున్న హైదరాబాద్ ప్రతిష్ట మరింత పెంచేలా కార్యాచరణను అమలుచేస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తితో అన్ని మతాల ప్రజల విశ్వాసాలు, సంస్కృతి సాంప్రదాయాలు, మనోభావాలకు ప్రాధాన్యతనిస్తున్నది మంత్రి స్పష్టం చేశారు. ప్రజల బాధలు, భయాలు తొలగాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా ముత్యాలమ్మ తల్లి దీవించాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, సనత్ నగర్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ కోట నీలిమ, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, అసిస్టెంట్ కమిషనర్ సంధ్యా రాణి, పలువురు కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి
- నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో


వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు వరంగల్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు శ్రీమతి కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఓఆర్ఆర్ , భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు.

## శబరిమల సమగ్ర సమాచారంతో మైక్రోసైట్

బలగం టీవి, తిరువనంతపురం

కేరళలోని శబరిమల అయ్యప్ప దేవాలయానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో మైక్రోసైట్, ఈ-బ్రోచర్లను రాష్ట్ర పర్యాటక శాఖ బుధవారం ప్రారంభించింది. వీటిని రాష్ట్ర పర్యాటక, ప్రజా పనుల శాఖ మంత్రి పీఏ మహమ్మద్ రియాస్ ప్రారంభించారు. https://www. keralatourism.org/sabarimala ద్వారా శబరిమలలోని అయ్యప్ప దేవాలయం సంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతి, తాజా వివరాలు, భౌగోళిక పరిస్థితులు వంటివాటిని తెలుసుకోవచ్చు. దీనిలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళం, కన్నడ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుంది. భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ యాత్రను పూర్తి చేసుకోవడానికి ఈ మైక్రోసైట్, ఈ-బ్రోచర్ ఉపయోగపడతాయని మహమ్మద్ చెప్పారు. రాష్ట్రంలో భక్తి పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు మరిన్ని ప్రాజెక్టులు అందుబాటులోకి తెస్తామన్నారు.

## ఏటీఎం నుంచి పీఎఫ్ విత్‌డ్రా..!




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఈపీఎఫ్ఓ ఖాతాదారులు తమ పీఎఫ్ సొమ్మును తీసుకోవడం ఇక మీదట మరింత సులువు కానుంది. బ్యాంకు అకౌంట్ నుంచి ఏటీఎం ద్వారా డబ్బులు విత్‌డ్రా చేసుకున్నంత సులభంగా ఈపీఎఫ్ఓ ఖాతా నుంచి డబ్బులు తీసుకునే వెసులుబాటు రానున్నది. జనవరి నుంచి ఖాతాదారులు పీఎఫ్ డబ్బులను నేరుగా ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించనున్నట్టు కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమిత దావ్రా బుధవారం ప్రకటిం చారు. ఈ మేరకు తమ ఐటీ వ్యవస్థలను ఆధునీకరి స్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ఈపీఎఫ్ఓ క్లెయిమ్‌లను చాలా వేగంగా పరిష్కరిస్తున్నామని, ఇప్పుడు మరింత సులువుగా మార్చే దిశగా పని చేస్తున్నట్టు చెప్పారు. క్లెయిమ్‌దారు, లబ్ధిదారులు నేరుగా ఏటీఎంల ద్వారా తమ క్లెయిమ్ డబ్బులను పొందొచ్చని చెప్పారు. అయితే, ఈ కొత్త విధానం ఎలా పని చేస్తుందన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈపీఎఫ్ఓ ఖాతాదారులు ఆన్‌లైన్‌లో క్లెయిమ్ చేసుకున్నాక వారం, పది రోజుల్లో బ్యాంకు ఖాతాలోకి డబ్బులు పడుతున్నాయి. మరి, ఈ కొత్త విధానం ఇందుకు ఏ రకంగా భిన్నంగా ఉంటుందనేది తెలియాల్సి ఉంది.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా విద్యాలయం ఆవరణ స్వచ్ఛత, పరిశుభ్రతను అలాగే స్టోర్ రూంలోని బియ్యం, కూరగాయలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాలు వారు పరిశీలించారు. విద్యార్థుల కోసం ఆహారం సిద్ధం చేస్తుండగా, నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయం ఆవరణ స్వచ్ఛంగా.. పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు సిద్ధం చేసే ఆహార పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. కుక్, సహాయకులు నిబంధనల ప్రకారం రక్షణ చర్యలు తీసుకుంటూ విధులు నిర్వర్తించాలని అన్నారు



# వసతి గృహాల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

**-ఫుడ్ పాయిజెన్ పై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం**

**-బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్**

**బలగం టీవీ , సిరిసిల్ల**

వసతి గృహాల నిర్వహణ లో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు.రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఫుడ్ పాయిజన్ సంఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా ముఖ్యమంత్రికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలలోకి వచ్చి కనువిప్పు కలిగేలా చేయాలని బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్బంగా బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్న విద్యాశాఖ మంత్రి లేడని, గురుకుల సంక్షేమ శాఖ మంత్రి లేరని అన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతి గృహాల్లో 12 నెలల కాలంలో 50 కి పైగా విద్యార్థులు మరణించారని, 700 పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వలన అస్వస్థతకు గురయ్యి హాస్పిటల్ బారిన పడ్డారని అన్నారు.రోజుకు ఒక చోట ఇలాంటి ఘటనలు జరుగుతున్న,ఈ రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇటీవలే నారాయణపేట జిల్లా మాగనూరు 40 మంది విద్యార్థుల విషాహారం తిని తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మరువక ముందే తాజాగా నిన్నటి రోజున వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలోని సాయిపూర్ ట్రైబల్ వేల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకుంది అని, 30 మంది విద్యార్థులు విషాహారం తిని అస్వస్థతకు గురయ్యారు అని హుటాహు టిన విద్యార్థినులను తాండూరు ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్పించి చికిత్సను అందించారు అని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కళ్ళు తెరిచి ఇలాంటి సంఘటనలు జరుగకుండా అధికారు లతో రివ్యూ చేసి విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు.లేని పక్షంలో విద్యార్థులతో కలిసి రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మట్టే శ్రీనివాస్,ముగ్ధం అనిల్ గౌడ్, నవీన్,సంపత్, రాహుల్,అజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు .

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర

**● ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , బోయినిపల్లి**

నేరాల నియంత్రణ, కేసులు ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం బోయనినపల్లి మండలం కోదురుపాక చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ సీసీ కెమెరాలను,కోదురుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిచిన,ర్యాష్ డ్రైవింగ్ చేసిన జిల్లాకు వచ్చే అనుమానిత వాహనాలను గుర్తించేందుకు జిల్లా సరిహద్దుల్లో ఆధునిక ఆటోమేటిక్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.అందులో భాగంగానే కోదురుపాక చౌరస్తా వద్ద రెండు ఆటోమేటిక్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించ వచ్చన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు



ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కొదురుపాక గ్రామంలో 05 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోసిఐ శ్రీనివాస్, ఎస్ఐ పృథ్వీందర్ గౌడ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ సస్పెన్షన్..

**బలగం టీవీ , సిరిసిల్ల**

స్కూల్లో మత ప్రచారం చేసేందుకు యత్నించిన ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ లింగాల రాజును సస్పెండ్ చేస్తూ డీఈఓ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డి పేట మండలం నారాయణపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ మతానికి సంబంధించిన కరపత్రం, ఇతర సామాగ్రి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ విషయం జిల్లా విద్యాధికారి కి చేరడంతో ఆ టీచర్ ని నీ సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు.

## హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్

**బలగం టీవీ ,హైదరాబాద్**

హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో గల సంధ్యా థియేటర్ ఘటనపై సినీ నటుడు అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఘటనకు సంబంధించి తనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.

పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 105, 118 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



## నూతన కమిటీకి ఆహ్వానం

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షులు రాపోలు వీరమోహన్ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఈ నెల 29 రోజున జరుగబోయే తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావాలని ఆహ్వానించారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గుజ్జె తార , రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు అంకారపు మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆడెపు చంద్రకళ , రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటుక మహేష్ పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత..

**బలగం టీవీ, గంభీరావుపేట**

గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి లోని నిరుపేద కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన షేక్ ముస్తాక్ బాబా గత రెండు రోజుల క్రితం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. షేక్ ముస్తాక్ బాబా కుటుంబం నిరు పేద కుటుం బం కావడంతో, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ముస్లిం కమ్యూనిటీ సభ్యులు, కొత్తపల్లి గ్రామస్తులు చేయూతనివ్వాలని నిర్ణయించుకుని,50,900 వేలను బుధవారం షేక్ ముస్తాక్ బాబా కుటుంబానికి మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అదిల్ మరియు గ్రామస్తుల చేతుల మీదుగా అందజేశారు.



## ఇండియా కూటమిని నడపాల్సిన బాధ్యత నాపై ఉంది: మమతా బెనర్జీ

**బలగం టీవీ ,హైదరాబాద్**

ఇండియా కూటమిని తానే ఏర్పాటు చేశానని... కాబట్టి దానిని నడపాల్సిన బాధ్యత తనపై ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశం అభివృద్ధి చెందాలని, ప్రజలు బాగుండాలని తాను నిరంతరం కోరుకుంటానన్నారు. తనపై గౌరవంతో, నమ్మకంతో కూటమికి సారథ్యం వహించాలని కోరుకునే కూటమి నేతలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

మమతా బెనర్జీ మాట్లాడుతూ... తనకు అవకాశమిస్తే కూటమిని సమర్థవంతంగా నడిపిస్తానని వ్యాఖ్యానించారు. ఆమె ప్రకటనపై సమాజ్‌వాది, ఆర్జేడీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) పార్టీల నేతలు ఆమెకు మద్దతు పలుకుతున్నారు. బీజేపీ వ్యతిరేక పోరాటంలో మమతా బెనర్జీ ఓ మూలస్తంభమని, కూటమి నేతలమంతా కూర్చొని నాయకత్వం గురించి మాట్లాడుకుంటామని ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారి అన్నారు. మమతా బెనర్జీ ప్రధాన భాగస్వామి కావాలని కోరుకుంటున్నామని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నేత సంజయ్ రౌత్ అన్నారు. మమత నాయకత్వంలో ప్రతిపక్ష కూటమి ముందుకు వెళ్లాలని తాము కోరుకుంటున్నామని లాలూ ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి ఏ రోజు 'జై తెలంగాణ' అనలేదు..

- **డిసెంబర్ 9 ప్రకటనకు కారణం కేసీఆర్**
- **మాజీ మంత్రి హరీశ్‌రావు**



**బలగం టీవి, సిద్దిపేట**

సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి చరిత్రలో ఏ రోజు జై తెలంగాణ అనలేదుఉద్యమంలో పాల్గొనలేదు అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సంగారెడ్డిలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటన వచ్చిందంటే కారణం కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఎవరో దయతో వచ్చిందని సీఎం చెబుతుంటే ఇది తెలంగాణ ఉద్యమం, అమరులను అవమాన పరచడమే అని మండిపడ్డారు. తెలంగాణకి నంబర్ వన్ విలనే కాంగ్రెస్ పార్టీ. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టకపోతే తెలంగాణ అనే మాటే లేదు కదా. తెలంగాణ అనే పదం అసెంబ్లీలో ఆనాడు నిషేధించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన, 16 ఏళ్ల టీడీపీ పాలనలో తెలంగాణ అనే పదం లేకుండా చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉండి ఢిల్లీలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించి తెలంగాణకు అనుకూలంగా లేఖలు తెప్పించారు. 2004 నుంచి 2009 వరకు మాతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వకుండా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్. నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన లేకపోతే జూన్ 2 లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు

**(మొదటి పేజీ తరువాయి)**

అసలు మొదలే పెట్టలేదు. వానాకాలం సీజన్ లో పెట్టుబడి సాయాన్ని మొత్తానికే ఎగ్గొట్టి రైతాంగాన్ని నిలువునా ముంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, కౌలు రైతులకు కూడా రైతుభరోసా కింద 15 వేలు, రైతు కూలీలకు 12 వేల చొప్పున ఇస్తామన్న హామీకి ఏడాదైనా అతీ గతీ లేదు. ఎన్నికల ప్రచారంలో వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని నమ్మబలికి, తీరా గద్దెనెక్కాక సన్న వడ్లకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కిన మీ సన్నాసి ప్రభుత్వ నిజస్వరూపాన్ని రైతులు అర్థం చేసుకున్నారు. కాంగ్రెస్ ను నమ్మితే రైతుకు గోస తప్ప భరోసా లేదని తొలి ఏడాది పాలనలోనే తేల్చి చెప్పారు. బోనస్ మాట దేవుడెరుగు కనీసం పంట కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర లేక "సాగు" మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయింది. విత్తనాలు, ఎరువుల కోసం మళ్లీ క్యూలైన్లో చెప్పులు, పాసు పుస్తకాలు పెట్టే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ సర్కారును చూసి అన్నదాతలు అసహ్యించుకుంటున్నారు.

అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ వేసి.. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మీరిచ్చిన హామీ గంగలో కలిసిపోయింది. ఈ ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భర్తీ చేసిన ఉద్యోగాలు కేవలం 12,527 మాత్రమే. అంటే తెలంగాణ యువతకు మీ కాంగ్రెస్ ప్రభుత్వం అక్షరాలా 1,87,473 ఉద్యోగాలు బాకీ ఉందనే విషయాన్ని తెలంగాణ యువత మరిచిపోలేదు. యువతకు ఇస్తామన్న 10 లక్షల వడ్డీ లేని రుణాలు ఏమయ్యాయని తెలంగాణ సమాజం మిమ్మల్ని సూటిగా ప్రశ్నిస్తోంది. ఇక అశోక్ నగర్ లో నిరుద్యోగులతో ఫోటోలకు ఫోజులు కొట్టి అడ్రస్ లేకుండా పోయిన మీరు కూడా కాంగ్రెస్ చేసిన మోసంలో భాగస్వాములేనని యువత బలంగా నమ్ముతోంది.

ఎన్నికల ప్రచారంలో ఆడబిడ్డలకు అరచేతిలో వైకుంఠం చూపించి నిలువునా మోసం చేశారు. అరకొరగా నడిచిన ఫ్రీ బస్సు స్కీమ్ తప్ప మహిళలకు ఒరిగిన ప్రయోజనం ఒక్కటీ లేదు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ .2500 హామీకి 365 రోజులు గడిచినా మోక్షం లేదు. నయా పైసా ఇచ్చే దిక్కులేదు కానీ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మీ ఢిల్లీ పార్టీ చేసిన ప్రకటనలోని డొల్లతనాన్ని తెలంగాణ ఆడబిడ్డలు పసిగట్టేశారు. కల్యాణలక్ష్మి పథకానికి తోడు తులం బంగారం ఇస్తామని మభ్యపెట్టి.. చివరికి అసలు పథకానికి కూడా ఎసరు పెట్టిన దగుల్బాజీ పాలన మీది. ఏడాది కాలంగా కల్యాణలక్ష్మి సాయం అందని పేద తల్లిదండ్రులు కాంగ్రెస్ కు శాపనార్థాలు పెడుతున్నారు.

హైడ్రా పేరిట హంగామా సృష్టించి నిరుపేదలకు నిలువ లేకుండా చేసిన పాపం మీ కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుంది. మూసీ బ్యూటిఫికేషన్ పేరిట మీ లక్షన్నర కోట్ల లూటిఫికేషన్ ప్లాన్ కూడా బట్టబయలైంది. బీఆర్ఎస్ హయాంలోనే ఎస్టీపీల నిర్మాణం పూర్తయినా కూడా, ఈ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు టార్గెట్ పెట్టడం మూసీలో మీ మూటల వేటకేనని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు.

ఓవైపు కూల్చివేతలే కాదు.. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట కాల్చిచంపుతున్న కాంగ్రెస్ సంస్కృతిని మరోసారి తెలంగాణలో అమలుచేయడం దిగ్భ్రాంతికరం. ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు అన్నట్టుగా సాగుతున్న మీ పాలనా తీరు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోంది. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా నిర్బంధం, సకల రంగాల్లో సంక్షో ఓవైపు అల్లుడి ఫార్మా కంపెనీ కోసం, మరోవైపు అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం సొంత నియోజకవర్గం కొడంగల్ లో సీఎం బలంవంతంగా భూములు లాక్కునే కుట్రను దళిత, గిరిజన ఆడబిడ్డలు ఢిల్లీ వేదికగా ఎండగట్టినా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిరాలేదు. ఫార్మా విలేజీ ప్లాన్ బెడిసికొట్టిందనే కక్షతో ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట మీ ప్రభుత్వం మరో కుతంత్రాన్ని తెరపైకి తెచ్చి పచ్చని భూముల్లో చిచ్చుపెట్టే పన్నాగాలను ప్రజలు మరోసారి తిప్పికొట్టడం ఖాయం.

అతి తక్కువ కాలంలో అత్యధిక ప్రజాధనాన్ని లూటీచేసిన సర్కారుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ చీకటి చరిత్రను లిఖించింది. సీఎం బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండర్ నుంచి మొదలుకుంటే.. 1100 కోట్ల పౌరసరఫరాల స్కామ్, మంత్రి పొంగులేటి కుమారిడికి అప్పజెప్పిన కొడంగల్ లిఫ్ట్ పనుల దాకా.. అడుగడుగునా వేల కోట్ల అవినీతే తాండవిచ్చింది. ఇక మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ఏకంగా లక్షన్నర కోట్లకు ముఖ్యమంత్రి రేవంత్ వేసిన స్కెచ్ ను చూసి యావత్ సమాజం నివ్వెరపోయింది. గోదావరి జలాలను మూసీకి తరలించే అంచనాలను 1100 కోట్ల నుంచి 5500 కోట్లకు అమాంతం పెంచేయడం మీ దోపిడీకి పరాకాష్ట. ఈ స్కాములే తాచుపాములై మీ కాంగ్రెస్ ను వెంటాడటం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నాను. ఆత్మగౌరవం, స్వయంపాలన నినాదాలతో సాధించుకున్న తెలంగాణలో ఈ విష సంస్కృతిని తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదు. సీఎం రేవంత్ చేసిన ఈ నీచమైన, కుటిల చర్యలకు ప్రతిస్పందనగా భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గుర్తులు తెలంగాణలో చెరగడం ఖాయం అని గుర్తుంచుకోండి. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ అంటే గౌరవం ఉన్నప్పటికీ కేవలం రేవంత్ రెడ్డి చేసిన ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రతి స్పందనగా అసలైన తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపైన, తెలంగాణ సమాజంపైన ఉన్నది.

ప్రజల ఆశీస్సులతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ మరియు ఇతర కాంగ్రెస్ నాయకుల పేర్లతో ఉన్న ప్రతి సంస్థ పేరును మార్చడంతో పాటు తెలంగాణ సచివాలయం ముందు ఏర్పాటుచేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని, మీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని మీ పార్టీ కార్యాలయమైన గాంధీభవన్ కు సకల మర్యాదలతో సాగనంపుతామని నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా స్పష్టంచేస్తున్నాను. మీ కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ ను మీ ముఖ్యమంత్రి ఇకనైనా మానుకుంటే మీకే మంచిది. చేతనైతే హామీలు అమలుచేయండి, లేదంటే తెలంగాణ ప్రజల ముందు లెంపలేసుకుని క్షమాపణలు కోరండి. అంతేకానీ, మేము పదేళ్లలో పెంచిన రాష్ట్ర సంపదను దోచుకుని, ఘనమైన తెలంగాణ చరిత్ర ఆనవాళ్లను చెరిపేస్తామంటే సహించేది లేదు. మళ్లీ తెలంగాణను దశాబ్దాల సంక్షోభంలోకి నెట్టివేసి చేతులు దులుపుకుంటామంటే మాత్రం చూస్తూ ఊరుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరు.



# ఉత్తమ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అవార్డులిస్తాం

**బలగం టీవి, హైదరాబాద్**

రానున్న కాలంలో ప్రతి ఏటా ఉత్తమ పార్లమెంటేరియన్ తరహాలో ఉత్తమ ఎమ్మెల్యే, ఉత్తమ ఎమ్మెల్సీలకు అవార్డులు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంటామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గత పదేండ్ల కాలంలో ఎప్పుడు కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించలేదని తెలిపారు. శాసనసభ సమావేశాలకు, రాజకీయ పార్టీలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అయినా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాకపోవడం శోచనీయమన్నారు. శిక్షణా కార్యక్రమాలకు హాజరు కావాలని ఆయన కోరారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు రెండ్రోజులపాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ తదితరులు జ్యోతి ప్రజ్వలనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధికి పదవి మహోన్నతమైందన్నారు. గత పదేండ్లలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదని తెలిపారు. ప్రమాణస్వీకారం రోజునే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐడీకార్డులతో పాటు రూల్స్ అండ్ రెగులేషన్స్‌కు సంబంధించిన పుస్తకాలను ఇస్తారనీ, వాటిని ఎవరూ చదవడం లేదని అన్నారు. ఇప్పుడు ఉన్న 119 మంది ఎమ్మెల్యేల్లో 57 మంది నూతనంగా ఎన్నికైన వారే ఉన్నారనీ, వారందరూ కచ్చితంగా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'ఎంబీబీఎస్ చదివితే డాక్టర్ అవుతారు . ఇంజినీరింగ్ చదివితే ఇంజినీర్ అవుతారు. అలాగే ప్రజల మనస్సు చదివితేనే ప్రజా ప్రతినిధులం అవుతాం' అని గుర్తు చేశారు. ఐదేండ్లపాటు ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తులో గెలుస్తామన్నారు. ప్రస్తుతం ఎన్నికల ఖర్చు పెరిగిపోవడం సమాజానికి మంచిది కాదని తెలిపారు. అతి సామాన్యుడు కూడా పోటీ చేసేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో విమర్శలకు భయపడకుండా ప్రతివిమర్శతో ముందుకుపోవాలని సూచించారు.

## సీపీకి బాండ్ సమర్పించిన నటుడు మంచు మనోజ్

**బలగం టీవి, హైదరాబాద్**

శాంతి భద్రతలకు విఘాతం కలిగించనని, తనంతట తాను గొడవలకు దిగనని ప్రముఖ నటుడు, సినీ హీరో మంచు మనోజ్ రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు బాండ్‌ను సమర్పించారు. బుధవారం మంచు మనోజ్ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ముందు హాజరయ్యారు. సీపీ అడిగిన పలు ప్రశ్నలతోపాటు, చోటు చేసుకున్న సంఘటనపై సీపీకి మనోజ్ వివరించినట్టు తెలిసింది. ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని, రోడ్డుకెక్కవద్దని మనోజ్‌ను సీపీ ఆదేశించినట్టు సమాచారం. ముఖ్యంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించినట్టు తెలిసింది. కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మంచు మనోజ్ ఒక సంవత్సరం కాలం పాటు శాంతిని కాపాడడానికి ఎలాంటి ప్రతికూల చర్యలకు దిగకుండా ప్రజాశాంతికి భంగం కలిగించకుండా ఉంటానని రూ.లక్ష విలువగల బాండ్‌ను సీపీకి సమర్పించారు. ఇదిలా ఉండగా మంచు విష్ణు రాత్రి సీపీ ఎదుట హాజరై జరిగిన ఘటన వివరాలను వివరించారు. విష్ణును కూడా పోలీసులు వ్యక్తిగత బాండ్ ఇవ్వాలని అడిగినట్టు తెలిసింది. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సీపీ సూచించినట్టు సమాచారం.

మంచు మోహన్ బాబు మీడియాపై చేసిన దాడి నేపథ్యంలో జల్ పల్లిలోని మంచు టౌన్ వద్ద బుధవారం జర్నలిస్ట్ సంఘాలు ధర్నాకు దిగాయి. ఈ ధర్నాకు మంచు మనోజ్ మద్దతు తెలిపి తన తండ్రి తరపున క్షమాపణ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాన్న దేవుడని, ఇప్పుడున్న తమ నాన్న నాన్నకాదని ఆయనను ఎవరో మార్చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. తాను ప్రేమించి పెండ్లి చేసుకున్నానని, అందులో తప్పేముందన్నారు. తన భార్య, కుటుంబాన్ని అవమానపరిచారని, ఆస్తికోసం తాను ఎప్పుడు ఆశపడలేదనీ,సొంత వ్యాపారం చేసుకుంటున్నానని, తన మీద ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తమ కుటుంబంలో గొడవలకు కారణం వినయ్ అనే వ్యక్తి అన్నారు. మూడు రోజుల క్రితం పోలీస్ సపోర్ట్ అడిగినప్పుడు పోలీసులు తనకు మద్దతు తెలపలేదని, అందుకు తాను డయల్ 100కి ఎందుకు ఫోన్ చేశాను ఆ వివరాలు మీడియా మిత్రులు తెలుసుకోవాలని కోరారు. ఇంట్లో పది బండ్లు ఉన్నా అంబులెన్స్ లో హాస్పిటల్ కి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంట్లో సీసీ కెమెరాల రికార్డును కిరణ్, విజయ్ అనే వ్యక్తులు దొంగిలించారని, ఆ రికార్డులను చూస్తే మీకు అర్థమవుతుందన్నారు. ఆ దొంగలు తమ ఇంట్లోనే తిరుగుతూ, ఓ అమ్మాయిని ఇంటి నుంచి పరిగెత్తేలా చేశారన్నారు. తన కూతురు బట్టలు సర్దే ప్రయత్నం చేశారని, కంగారుగా డీజీపీ ఆఫీస్‌కు వెళ్లానని, పిల్లల జోలికొస్తే భయమేస్తుందని తెలిపారు. తాను అబద్ధాలు ఆడే వ్యక్తిని కాదు, దీనికోసం మీరు ఎవరినైనా అడిగితే తెలుస్తుందన్నారు. విద్యానికేతన్‌లో జరిగిన అక్రమాలపై ప్రశ్నించడంతోనే తనపై టార్గెట్ చేశారన్నారని, వేరే వాళ్ళ కడుపులు కొట్టి తన పిల్లలకు పెట్టలేననీ, తన పిల్లలు పెద్దయ్యాక వారికి సమాధానం చెప్పలేనన్నారు. తమ అమ్మ హాస్పిటల్‌లో ఉందని అబద్ధాలు చెప్పారని, తన భార్యకు తల్లి తండ్రి లేరు, ఆమెకు అన్ని నేనేనన్నారు. శాంతియుతంగా సమస్యను పరిష్కారం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని మనోజ్ మీడియాకు తెలిపారు.

నటుడు మంచు మనోజ్‌పై దాడి కేసులో విష్ణు ప్రధాన అనుచరుడు కిరణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తనపై దాడి చేశారని మనోజ్ పహడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# జాతిరత్నాలు దర్శకుడితో విశ్వక్‌సేన్ కొత్త సినిమా






**బలగం టీవీ, హైదరాబాద్**

'జాతిరత్నాలు' దర్శకుడు అనుదీప్ , నటుడు విశ్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం పూజా కార్యక్రమాలు బుధవారం నాడు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఫంకీ' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టగా, దర్శకుడు కళ్యాణ్ శంకర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నిర్మాత ఎస్. నాగవంశీ స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు. ఈ చిత్రం ప్రారంభం సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ కూడా అందర్నీ ఆకట్టుకుంటోంది.

ఫంకీ చిత్రానిక. ప్రముఖ ఛాయగ్రాహకుడు సురేష్ సారంగం కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. 'టిల్లు స్క్వేర్', 'మ్యాడ్' చిత్రాలతో తన సంగీతంతో ఆకట్టుకొని, ప్రస్తుతం 'మాస్ జాతర', 'మ్యాడ్ స్క్వేర్' వంటి సినిమాలకు పని చేస్తున్న భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

2025 జనవరి నుంచి రెగ్యులర్‌ను షూటింగ్‌ను ప్రారంభిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: సురేష్ సారంగం



# రూట్‌ను వెనక్కి నెట్టిన హ్యారీ బ్రూక్..

**బలగం టీవీ, హైదరాబాద్**

: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ వచ్చేశాయి. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ మొదటి స్థానానికి దూసుకొచ్చాడు. జో రూట్‌ను అతను వెనక్కి నెట్టేశాడు. ఇక బౌలింగ్‌లో ఇండియన్ పేసర్ బుమ్రా నెంబర్ వన్ స్పాట్‌లోనే ఉన్నాడు. ఆల్‌రౌండర్ పాత్రలో రవీంద్ర జడేజా టాప్‌లో ఉన్నాడు. 25 ఏళ్ల బ్రూక్ టెస్టుల్లో 8వ సెంచరీ నమోదు చేశాడు. వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్లో తాజాగా అతను సెంచరీ చేశాడు. ఒక్క పాయింట్ తేడాతో రూట్ కన్నా బ్రూక్ మెరుగయ్యాడు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బ్రూక్‌కు 898 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. జూలై నుంచి బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రూట్ ఫస్ట్ ప్లేస్ లో ఉన్నాడు. కేన్ విలియమ్‌సన్‌ను దాటేస్తూ అతను ఆ స్థానానికి వచ్చాడు. టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానంలో ఉన్నాడు. 890 రేటింగ్ పాయింట్లతో అతను టాప్‌లో కొనసాగుతున్నాడు. సౌతాఫ్రికా బౌలర్ కగిసో రబడా 856 పాయింట్లతో బుమ్రాకు పోటీ ఇస్తున్నాడు. ఆ తర్వాత స్థానంలో జోష్ హేజిల్‌వుడ్ అన్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ ర్యాంకుల్లో రవీంద్ర జడేజా నెంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. 415 రేటింగ్ పాయింట్లతో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మెహిది హజన్ మీర్జా రెండో స్థానంలో ఉన్నాడు

# అఖండ 2 షూటింగ్ ప్రారంభం

## రిలీజ్ డేట్ ప్రోమో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం అఖండ 2 అనే సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాకి స్టార్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తుండగా 14రీల్స్ బ్యానర్ పై నారా బ్రాహ్మణి, తేజస్విని కలసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 2021 లో వచ్చిన అఖండ చిత్రానికి సీక్వెల్ గా బోయపాటి శ్రీను ఈ సినిమాని తెరకేకిస్తున్నాడు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు.

అయితే ఇటీవలే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని అఖండ 2 షూటింగ్ ప్రారంభమైంది. దీంతో ఈ అఖండ 2 సినిమాని వచ్చే ఏడాది సెప్టెంబర్ 25 న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా మేకర్స్ ప్రకటించారు. అలాగే ఈ విషయానికి సంబందించిన పోస్టర్లు, టైటిల్ ప్రోమోని కూడా రిలీజ్ చేశారు. ఈ వీడియోలో ఈ నేల అసురుడిది కాదురా.. ఈశ్వరుడిది అంటూ బాలకృష్ణ డైలాగ్స్, శివుడి తాండవం చేస్తున్న విజువల్స్‌తో సాగుతున్న ప్రోమో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ డైలాగ్ ఆకట్టుకుంటోంది. ఇక పోస్టర్ లో రక్తంతో తడిసిన త్రిశూలం పట్టుకున్న చేయి కనిపించింది. ఫస్ట్ పార్ట్‌లో బాలకృష్ణ డ్యుయల్ రోల్‌లో నటించి గూస్ బంప్స్ తెప్పించే యాక్టింగ్‌తో అదరగొట్టేశాడని తెలిసిందే.






# చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన.. !

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా మహిళా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన(109 బంతుల్లో 14 ఫోర్లు, సిక్స్‌తో 105) చరిత్ర సృష్టించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో బుధవారం జరిగిన మూడో వన్డేలో సెంచరీ చేయడం ద్వారా స్మృతి మంధాన అరుదైన ఘనతను అందుకుంది. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో నాలుగు వన్డే సెంచరీలు చేసిన తొలి మహిళా బ్యాటర్‌గా చరిత్రకెక్కింది. బెలిండా క్లార్క్(1997), మెగ్ లానింగ్(2016), అమీ సాటర్త్ వైట్(2016), సోఫీ డివైన్(2018), సిద్రా అమిన్(2012), నాట్ సివర్(2023), లారా వోల్వార్ట్(2024) ఒకే క్యాలెండర్ ఇయర్‌లో మూడేసి సెంచరీలు బాదారు. ఈ ఏడాది నాలుగు శతకాలు నమోదు చేసిన స్మృతి మంధాన ఈ ఘనతను అందుకున్న తొలి బ్యాటర్‌గా చరిత్రకెక్కింది. ఇక స్మృతి మంధానకు ఇది 9వ వన్డే శతకం. ఈ క్రమంలోనే అత్యధిక సెంచరీలు నమోదు చేసిన తొలి ఆసియా బ్యాటర్‌గా శ్రీలంక ప్లేయర్ చమరి ఆటపట్టు రికార్డ్‌ను సమం చేసింది.

ఈ మ్యాచ్‌లో మంధాన సెంచరీతో మెరిసినా భారత్‌కు విజయం దక్కలేదు. దాంతో ఆస్ట్రేలియా పర్యటనను భారత మహిళల జట్టు ఘోర పరాజయంతో ముగించింది. మూడు వన్డేల సిరీస్ కోసం ఆసీస్ పర్యటనకు వచ్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 0–3తో క్లీన్ స్వీప్‌కు గురైంది. బుధవారం ముగిసిన మూడో వన్డేలో ఆస్ట్రేలియా 83 పరుగుల తేడాతో భారత జట్టును ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 298 పరుగులు చేసింది. అన్నాబెల్ సదర్లాండ్(95 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110) శతకంతో సత్తా చాటగా.. ఆష్లీ గార్డ్‌నర్(64 బంతుల్లో 5 ఫోర్లతో 50), తహిలా మెక్‌గ్రాత్(50 బంతుల్లో 5 ఫోర్లతో 56 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు.

భారత బౌలర్లలో తెలుగు తేజం అరుందతి రెడ్డి(4/26) నాలుగు వికెట్లు తీయగా.. దీప్తి శర్మ ఓ వికెట్ తీసింది. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత మహిళల జట్టు 45.1 ఓవర్లలో 215 పరుగులకు కుప్పకూలింది. స్మృతి మంధాన మినహా మరే బ్యాటర్ రాణించలేదు. హర్లీన్ డియోల్(64 బంతుల్లో 4 ఫోర్లతో 39) కాస్త పర్వలేదనిపించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆష్లే గార్డ్‌నర్(5/30) ఐదు వికెట్లు తీయగా.. మేఘన్ స్కట్, అలనా కింగ్ తలో రెండు వికెట్లు తీసారు. అన్నబెల్ సదర్లాండ్‌కు ఓ వికెట్ దక్కింది.

# పుష్ప 2కు రూ.1000 కోట్లు




**బలగం టీవీ, హైదరాబాదం**

'పుష్ప 2' మరో కొత్త రికార్డును అందుకుంది. కేవలం ఆరు రోజుల్లోనే రూ.1000 కోట్ల గ్రాస్ మార్క్‌ను టచ్ చేసి ఆల్ టైమ్ రికార్డ్ సెట్ చేసింది. తద్వారా వేగంగా రూ.1000 కోట్లు సాధించిన ఇండియన్ ఫిల్మ్‌గా నిలిచింది. మొత్తంగా ఇప్పటి వరకు రూ.1002 కోట్ల గ్రాస్ వసూలు చేసింది.

కాగా, ఇప్పటివరకు రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడానికి బాహుబలి 2కు 10 రోజులు పట్టింది. ఆ తర్వాత ఆర్‌ఆర్‌ఆర్, కేజీయఫ్ 2 సినిమాలు 16 రోజుల్లో ఈ మార్క్‌ను టచ్ చేశాయి. కల్కి 2898 ఏడీ సినిమాకు 15 రోజులు పట్టింది. బాలీవుడ్‌లో షారుక్ ఖాన్ నటించిన జవాన్‌కు 18 రోజులు పట్టగా, పఠాన్‌కు 27 రోజుల సమయం పట్టింది. కానీ ఇప్పుడు పుష్ప 2 కేవలం ఆరు రోజుల్లోనే ఈ రూ.1000 క్లబ్‌లో చేరి ఆల్ టైమ్ రికార్డ్‌ను సెట్ చేసింది. మరో విషయమేమిటంటే బాహుబలి 2, ఆర్‌ఆర్‌ఆర్, కల్కి 2898 ఏడీ తర్వాత ఇంతటి భారీ వసూళ్లు అందుకున్న తెలుగు చిత్రం ఇదే కావడం విశేషం.



# 'దండోరా' పూజా కార్యక్రమాలు పూర్తి

**బలగం టీవీ, హైదరాబాద్**

నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిల్మ్ 'కలర్ ఫోటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' వంటి చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని మరో విభిన్నమైన సినిమాకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణ సంస్థలో 'దండోరా' సినిమా రూపొందనుంది. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఈ మూవీ బుధవారం రోజున ఫిల్మ్ నగర్‌లోని రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలను లాంఛనంగా పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు సెలబ్రిటీలు హాజరై చిత్ర యూనిట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టగా.. బేబీ నిర్మాత ఎస్ కే ఎన్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. యంగ్ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ గౌరవ దర్శకత్వం వహించారు.

తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో 'దండోరా' సినిమాను రూపొందించనున్నారు. మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమా తెరకెక్కనుంది. విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, రాహుల్ రామకృష్ణ, రవికృష్ణ, మనీక చిక్కాల, అనూష తదితరులు ప్రధాన